క్లుప్తంగా

తృణధాన్యాలపై అవగాహన పోటీలు

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ సెన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తృణధాన్యాల ప్రాసెసింగ్, పరికరాలు, యంత్రాలు, ప్యాకేజింగ్ వంటి అంశాల్లో వాల్ పోస్టర్ల రూపకల్పనపై పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరం - 2023లో భాగంగా ఈ పోటీలు జరిగాయి. కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చరిత్‌కుమార్ విజేతలను ఎంపిక చేశారు. ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 16, 17 తేదీల్లో హవానా - 2.0 పేరుతో ఇంజినీరింగ్ విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ మాధని తెలిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాల కోసం 93484 55589 నంబరులో సంప్రదించాలన్నారు.

'మనూ-సూడాన్' ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకున్న యూనివర్సిటీల ప్రతినిధులు

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంతో సూడాన్ వైట్‌నైల్ యూనివర్సిటీ మధ్య మంగళవారం ఒప్పందం కుదిరింది. పరస్పర ప్రయోజనకరమైన విద్య, పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను బలోపేతం చేయడానికి, ప్రోత్సహించడానికి కుదుర్చుకున్న ఈ ఒప్పందం అయిదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఉమ్మడి పర్యవేక్షణ, జాయింట్ రీసెర్చ్ ప్రాజెక్టులు, కాన్ఫరెన్స్‌లు, ఉమ్మడి అధ్యయన కోర్సులను ప్రోత్సహించడం, బోధన, పరిశోధన కార్యకలాపాలకు సంబంధించిన అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడికి రెండు విశ్వవిద్యాలయాలు అంగీకరించాయి.

డిగ్రీ కోర్సుల ఫీజుల పెంపునకు పాలక మండలి నిర్ణయం!

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి వివిధ డిగ్రీ కోర్సుల ఫీజుల పెంపునకు పాలక మండలి (ఈసీ) నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మంగళవారం ఓయూలో జరిగిన పాలక మండలి సమావేశంలో ఫీజుల పెంపుపై చర్చించినట్లు సమాచారం. ఫీజుల పెంపు పై గతంలో వేసిన కమిటీ నివేదిక అందగానే వచ్చే పాలక మండలి సమావేశంలో సభ్యుల ఆమోదంతో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర డిగ్రీ కోర్సుల ఫీజులను పెంచనున్నారు. ఇదిలా ఉండగా ఓయూ బడ్జెట్‌పై పాలకమండలి సమావేశంలో చర్చ జరిగింది. ఈనెల 27 జరిగే సెనెట్ సమావేశంలో సుమారు రూ.800 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఓయూ లింగ్విస్టిక్స్ విభాగం విశ్రాంత ప్రొ. అన్సారీకి రావాల్సిన వేతన బకాయిలపై చర్చ జరగలేదని తెలిసింది. గత నెల ఉద్యోగ విరమణ చేసిన ప్రొ.అన్సారీ తనకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని ఒంటరిగా దీక్ష చేపట్టగా ఈనెల 14న జరిగే పాలక మండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారుల హామీతో దీక్ష విరమించారు. కానీ పాలకమండలి చర్చించకపోవడంతో తిరిగి ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు ప్రొ.అన్సారీ పేర్కొన్నారు.

ప్రశాంతంగా టీఎస్-సెట్

ఉస్మానియాయూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష టీఎస్‌సెట్-2022 తొలిరోజు ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు. మంగళవారం టీఎస్‌సెట్ కార్యాలయంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ సెట్ ప్రశ్న పత్రాలకు సంబంధించిన కోడ్‌ను విడుదల చేశారు. తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాలలో రెండు విడతలుగా జరిగిన సెట్‌కు ఉదయం 80.2 శాతం, మధ్యాహ్నం 83 శాతం అభ్యర్థులు హాజరైనట్లు ప్రొ.మురళీకృష్ణ పేర్కొన్నారు.

సమయానికి చేరుకున్నా అనుమతించ లేదు..

అధ్యాపకుల అర్హత పరీక్ష టీఎస్‌సెట్-2022 తొలిరోజు గందరగోళం నడుమ ప్రారంభమైంది. కార్యదర్శి ప్రొ.మురళీకృష్ణ పరీక్ష నియమ నిబంధనల గురించి పూర్తి సమాచారాన్ని అభ్యర్థులకు చేరవేయకపోవడంతో వందలాది మంది సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోయారు. నాచారం, మల్లాపూర్ సెంటర్లలో అనేక మంది అభ్యర్థులను అధికారుల అనుమతించలేదు.

'టాట్' శిక్షణకు ప్రొ. వెంకటేశ్వర్లు ఎంపిక

సనత్‌నగర్: యువత విద్య, ఉపాధి అవకాశాలపై దేశవ్యాప్త సర్వే చేయడం కోసం బుధవారం ఢిల్లీలో నిర్వహించనున్న ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ (టాట్) శిక్షణ కార్యక్రమానికి బేగంపేట మహిళా కళాశాలకు చెందిన డాక్టర్ వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి 70 మంది ఎన్ఎస్ఎస్ అధికారులు ఎంపిక కాగా తెలంగాణ నుంచి 10 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. మంగళవారం డాక్టర్ కే వెంకటేశ్వర్లుకు ఆమె ఎంపిక పత్రాన్ని అందజేశారు.

ధాన్యం సేకరణకు సిద్ధం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనేందుకు యంత్రాంగం కసరత్తు

- 30 వేల మెట్రిక్ టన్నులు కొనడమే లక్ష్యం
- 11 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తి
- రైతులకు అన్ని వసతులు, సరిపడా గన్నీ బ్యాగులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: యాసంగిలో రైతు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో 11 కేంద్రాల ద్వారా ఏప్రిల్ రెండో వారం నుంచి ధాన్యం సేకరించేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది. యాసంగిలో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా, రైతులు 13,015 ఎకరాల్లో వరి పంట వేశారు. దీంతో వరి పంట దిగుబడి 33 వేల మెట్రిక్ టన్నులు రాగలదని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు పండించిన వరి ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. వరి ధాన్యం గ్రేడ్-ఏ క్వింటాల్ ధర రూ.2060, కామన్ గ్రేడ్ క్వింటాల్ ధర రూ.2040గా ఖరీదు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ధాన్యం సేకరణలో భాగంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఎండాకాలం కావడంతో ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు చేయాలని యంత్రాంగం ఆదేశించింది.

7.50 లక్షల గన్నీ బ్యాగులు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించటానికి 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌర సరఫరాల శాఖ అంచనా వేసినప్పటికీ లెక్కకు మించి 8.80 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు అధికార యంత్రాంగం తెలిపింది. అలాగే టార్పాలిన్లు, తేమ యంత్రాలు, పాడి క్లీనర్లు, కాంటాలు తది తర అవసరమైన వాటిని కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఎదులాబాద్, మాదారం 9 ఘట్కేసర్ మండలం), కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి (మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్, డబుల్‌పూరా, పూడూరు (మేడ్చల్ మండలం), శామీర్పేట్, కీసరలలో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు సంబంధిత అధికారులు, సిబ్బందితో ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించాం. ధాన్యం క్రయవిక్రయాలకు సంబంధించి దళారులను ఆశ్రయించొద్దు. వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పూర్తి డేటాను సేకరిస్తారు. తహసీల్దార్లు ధాన్యం సేకరణ కేంద్రాలను పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుంటారు.

– రాజేందర్, మేనేజర్, పౌర సరఫరాల శాఖ, మేడ్చల్-మల్కాజిగిరి

గతంలో సేకరించిన ధాన్యం ఇలా...

- 2020-21 యాసంగిలో 11 కొనుగోలు కేంద్రాల నుంచి 5,743 మంది రైతుల ద్వారా 28,615 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తో కొనుగోలు చేశారు.
- 2021-22 యాసంగిలో జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతుతో 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

మాజీ మంత్రి విజయ రామారావుకు నివాళి



విజయరామారావు పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మాజీ మంత్రి, మాజీ సీబీఐ డైరెక్టర్ విజయ రామారావు మరణ వార్త తనను కలచివేసిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం విజయరామారావు పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయంగా తన ఎదుగుదలకు ప్రోత్సాహం ఇచ్చిన వ్యక్తి విజయ రామారావు అని గుర్తు చేసుకున్నారు. ఒక మంత్రిగా, సీబీఐ డైరెక్టర్‌గా పని చేసినా అందరినీ ఆప్యాయతగా పలుకరించే వారని అన్నారు. నివాళులర్పించిన వారిలో కో-ఆర్డినేటర్ అరోరా, శ్యామల రాజు, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, రాజేష్ ఉన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం



డ్రైనేజీ సమస్యను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అల్లాపూర్ సొసైటీ కాలనీలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలోని డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారులతో కలిసి పరిశీలించామన్నారు. త్వరగా పనులను చేపట్టి భవిష్యత్‌లో సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్‌వైజర్ నరేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, సంగమేశ్వరరావు, శివరెడ్డి, రావూరి శ్రీనివాస్, రమేష్, సుబ్బారాయుడు, సత్యనారాయణ, మధు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాష్యం ఒలింపియాడ్ పాఠశాల వార్షికోత్సవం



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని భాష్యం ఒలింపియాడ్ పాఠశాల 23వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ డా. బి. రమాదేవి, భాష్యం పూర్వ విద్యార్థిని మెడికల్ సూపరింటెండెంట్ ఆఫ్ విరించి హాస్పిటల్స్ వైద్యురాలు హిమవర్షిణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ భాష్యం విద్యార్థులు విద్యతో పాటు ఆటపాటల్లో కూడా చక్కగా రాణిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల సీఈఓ చైతన్య, జెడ్ఈఓ శిరీష, ఒలింపియాడ్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, శివపార్వతి, రాజ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్విగ్గీ డెలివరీ బాయ్‌పై దాడి

గచ్చిబౌలి: ఓ స్విగ్గీ డెలివరీ బాయ్‌పై సెక్యూరిటీ గార్డులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డ ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 8.58 గంటల సమయంలో స్విగ్గీ డెలివరీ బాయ్ శాంతకుమార్ గచ్చిబౌలిలోని ఎన్‌సీసీ నాగార్జున రెసిడెన్సీ గేటెడ్ కమ్యూనిటీలో ఫుడ్ డెలివరీకి వెళ్లాడు. తిరిగి వస్తుండగా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులు ఆపి నువ్వు ఏ లిఫ్ట్‌లో వెళ్లావని అడగ్గా, స్విగ్గీ బాయ్ సర్వీస్ లిఫ్ట్‌లో వెళ్లానని చెప్పగా, లేదు నువ్వు మెయిన్ లిఫ్ట్‌లో వెళ్లావంటూ గొడవకు దిగారు. ఆరుగురు సెక్యూరిటీ గార్డులు దాడి చేయగా, గాయపడిన శాంతకుమార్ అక్కడి నుంచి తప్పించుకొని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన ముగ్గురు సెక్యూరిటీ గార్డులను అరెస్ట్ చేశారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



జెడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

బాలానగర్: ఐడీపీఎల్‌కాలనీ ఎదురుగా ఉన్న డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతకు ఆయన వినతిపత్రం అందజేశారు. అదే విధంగా కళ్యాణినగర్‌లో జరుగుతున్న షటిల్ కోర్టు పనుల కోసం సింథటిక్ మ్యాట్, గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్ కోసం అదనపు నిధులు కేటాయించాలని కోరారు.

వర్షాకాలం వచ్చేలోపు నాలా పనులు పూర్తి చేయాలి



స్నేహపురికాలనీలో నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: వర్షాకాలం వచ్చే లోపు ఇళ్ల మధ్య కొనసాగుతున్న నాలా పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ మహేందర్ ఆదేశించారు. మూసాపేట డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీలో కొనసాగుతున్న నాలా విస్తరణ పనులను మంగళవారం ఏఈ రంజిత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. నాలా విస్తరణ పనులను శరవేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినోద్, నాయకులు ఎర్రస్వామి, శ్రీను, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ధనికులు సమాజ సేవకు ముందుకు రావాలి





పటేల్‌కుంట పార్కు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించి ఎల్లమ్మబండ పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రవికుమార్

భాగ్యనగర్‌కాలనీ: బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటేల్‌కుంట పార్కు ఎదురుగా ఉన్న బీజేపీ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం శంషీగూడ, ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆర్‌కేవై ఫౌండేషన్ ద్వారా చలివేంద్రాలు, విద్యార్థులకు బుక్స్ పంపిణీ వంటి సేవా కార్యక్రమాల్లో తనను భాగం చేసిన అందరికి ధన్యవాదాలన్నారు. నియోజకవర్గంలోని ధనికులు ముందుకొచ్చి సమాజ సేవ చేయటానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణిభూషణ్, నర్సింగ్‌రావు యాదవ్, నరసింహచారి, భూపాల్‌రెడ్డి, శ్రావణి, పద్మ, నర్సింగ్‌రావు, నవీన్‌గౌడ్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తాం



సీసీరోడ్డు నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో భాగంగా ఆల్విన్ కాలనీ ఫేజ్-1లో మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ ఫేజ్-1లో వాటర్‌ట్యాంకర్ ఎదురుగా ఉన్న వీధిలో డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని అన్నారు. త్వరలో సీసీ రోడ్డు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా కొన్ని వీధుల్లో డ్రైనేజీ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవి పూర్తి చేసిన అనంతరం రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఏఈ శివప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, నాయకులు వెంకటేష్‌గౌడ్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణం ఎగ్గొట్టిన నిందితులకు జైలు

కేపీహెచ్‌బీకాలనీ: పరిశ్రమల ఏర్పాటు పేరుతో బ్యాంకు నుంచి రుణం పొంది ఎగ్గొట్టిన కేసులో ఏడుగురు నిందితులను దోషులుగా తేల్చుతూ కూకట్‌పల్లి ప్రిన్సిపాల్ జ్యుడిషియల్ సివిల్ జడ్జి, 11వ అసిస్టెంట్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు తీర్పును వెలువరించింది. వివరాల్లోకి వెళితే కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన జి. వేణుగోపాల్, ఏ. చంద్రశేఖర్, వి.శ్రీనివాస్, ఎస్‌వీఎస్ గిరి, వి.సురేందర్ బాబు, టి.కరుణానిధి, వి.సంధ్య అనే వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి చిన్నపాటి పరిశ్రమను ఏర్పాటు చేస్తామంటూ 2011లో కేపీహెచ్‌బీ కాలనీలోని ఇండియన్ బ్యాంక్ శాఖలో 26 ఖాతాలను తెరిచారు.

- పరిశ్రమల ఏర్పాటు కోసం సుమారు 22కోట్ల రూపాయల రుణాలు పొందారు. అట్టి రుణాన్ని పరిశ్రమల ఏర్పాటు కోసం కాకుండా ఇతర అవసరాలకు వినియోగించారు. తీసుకున్న రుణం చెల్లించకపోవటంతో విషయం తెలుసుకున్న బ్యాంక్ మేనేజర్ ప్రకాష్‌రావు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- 403, 420, 406, 156 (3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను కోర్టులో హాజరు పర్చటంతో విచారణ కొనసాగింది. కేసులో నిందితులుగా పేర్కొన్న ఏడుగురిని దోషులుగా నిర్ధారిస్తూ 11వ అసిస్టెంట్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మురళీ మోహన్ తీర్పు వెల్లడించారు. దోషులకు 18 నెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆవుల రవికుమార్ వాదనలు వినిపించారు.

తల్లిదండ్రుల పూజోత్సవం



తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల పూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సైకాలజిస్ట్ వైద్యులు రాజమౌళి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన పిల్లలకు లైఫ్ స్కిల్స్, డెషిషన్ మేకింగ్‌లతో పాటు ఎలా అభివృద్ధి చెందాలో పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో తల్లిదండ్రుల కాళ్లకు విద్యార్థులు పూజలు చేసి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శివ రామకృష్ణ, ఆర్ఐ పద్మజ, ప్రిన్సిపల్ సునీల, డీన్ శ్రీనివాస్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అమోర్ ఆస్పత్రిలో బర్న్స్ వార్డు ప్రారంభం



బర్న్స్ వార్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని అమోర్ ఆస్పత్రిలో మంగళవారం బర్న్స్ వార్డును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమోర్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా బర్న్స్ వార్డు ఏర్పాటు చేయటంతో ఈ ప్రాంత వాసులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. నిపుణులైన వైద్యులు ఉండటంతో పాటు మంచి పరికరాలతో కూడిన బర్న్స్ వార్డును ఏర్పాటు చేసినందుకు ఆసుపత్రి ఎండీ కిశోర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఆస్పత్రి ఎండీ డా. కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని ఇళ్లు , పరిశ్రమల్లో రకరకాల ప్రమాదాలు జరుగుతుంటాయి. అందులో కాలిన గాయాలైన వారికి నాణ్యమైన చికిత్స అందించేందుకు నాలుగు పడకల ఐసీయూ, ఐసోలేషన్ వార్డుతో కూడిన బర్న్స్ వార్డు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నిమిషం దగ్గరుండి జాగ్రత్తగా చూసుకునేందుకు సుశిక్షితులైన సిబ్బంది సిద్ధంగా ఉంటారన్నారు. ఆస్పత్రిలోని ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. 24 గంటలూ క్రిటికల్ కేర్ సపోర్ట్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష, ప్లాస్టిక్ సర్జన్ వైద్యులు బాదం అభినందన్, క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ సర్దార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. జయశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బాలానగర్: బాలానగర్, చెన్నారెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న ముక్తార్ అహ్మద్ (41) తన సోదరుడి ఖదీర్ అహ్మద్‌తో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈనెల 8వ తేదీ సాయంత్రం 4గంటల ప్రాంతంలో ముక్తార్ అహ్మద్ మద్యం సేవించి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన సోదరుడు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బహుమతుల ప్రదానం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ఆధ్వర్యంలో వారం రోజులుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో జరుగుతున్నాయి. మంగళవారం వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగులకు జెడ్సీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.